క్లుప్తంగా

మసీదుల అభివృద్ధికి నిధుల మంజూరు

అశ్వాపురం: మసీదుల ప్రహరీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన ప్రత్యేక నిధుల నుంచి రూ.35 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచికంటినగర్ గ్రామంలోని ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.15లక్షలు, మిట్టగూడెంలోని ఆర్అండ్బీ రోడ్డు నుంచి మసీదు వరకు సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, చింతిర్యాల క్రాస్ రోడ్డులో కరణం భారతి ఇంటి నుంచి మసీదు వరకు సీసీరోడ్డుకు రూ.5 లక్షలు, రామచంద్రాపురంలో మసీదు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే మండలంలో మసీదుల అభివృద్ధికి, రహదారులకు నిధులు మంజూరు చేయాలని ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్కె.ఖదీర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. తాజాగా ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయడంతో వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మందుల కొరత తీర్చాలి

మణుగూరుటౌన్: సింగరేణి వ్యాప్తంగా ఉన్న కంపెనీ ఆస్పత్రుల్లో కార్మికులకు దీర్ఘకాలిక వ్యాధుల మందులు కొరతగా ఉన్నాయని, కనీసం రెండు నెలలకు సరిపడా మందుల స్టాక్ ఉండేలా వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా డీవైసీఎంఓ జ్యోతిర్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందులను సమకూర్చడంతోపాటు ఖాళీగా ఉన్న స్పెషలిస్టు డాక్టర్లు, టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాసరావు, ఆదర్ల సురేందర్, గుంపెనలపల్లి శ్రీనివాసరావు, బంగారి రవికుమార్, సాయిప్రకాశ్ చారి, పద్మావతి, దాట్ల సందీప్, బొక్కా శ్రీనివాస్, నక్క రాజేందర్, కోదాటి రవి, టీఎల్ చారి, రామారావు, సందీప్, షేక్ వలి, కృష్ణ, నర్సయ్య, నిఖిల్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఖరీదైన ఆపరేషన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శనివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన సోడి సున్నా అనే వ్యక్తికి ఎముకల వైద్యుడు దేవరాజ్ మూడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేశారు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన సున్నాను భద్రాచలం ఏరియా ఆస్పత్రి తరలించగా.. వైద్యుడు దేవరాజ్ విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు. ఈ వైద్యం ప్రైవేట్ ఆస్పత్రిలో చేసి ఉంటే దాదాపు రూ.1.5 లక్షల వరకు ఖర్చు అయ్యి ఉండేదని ఆస్పత్రి అధికారులు తెలిపారు. డాక్టర్ దేవరాజ్‌ను భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డిలు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్ వసతి, రహదారి సౌకర్యం తదితర స్థానిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వేముకుంట గ్రామంలో గౌరి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మండలకమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, గుగులోతు దేవేందర్, బైరు ప్రసాద్, అమల పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ భక్తులు వీక్షిస్తుండగా స్వామివారి కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని పోలీస్ కాలనీలో జరిగిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తొమ్మిది మంది సభ్యులతో నూతన గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా జి. వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, ఎం.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా భద్రయ్య, కోశాధికారిగా కోటయ్య, కమిటీ సభ్యులుగా విల్సన్, యూత్ కమిటీ కార్యదర్శిగా ఆకుల కమలకుమార్లతోపాటు మహిళా కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్) పండుగను ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆ తరువాత ఖుర్బానీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖుర్బానీ ద్వారా పొందిన మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి, అందులో ఒక భాగాన్ని తమ కుటుంబం కోసం ఉంచుకొని, మిగిలిన రెండు భాగాలను సమాజంలోని నిరుపేదలకు దానం చేశారు. ఈ దానధర్మాలు పండుగ ప్రాముఖ్యతను చాటి చెప్పాయి. మత పెద్దలు పలు అంశాలను బోధించారు.

– సాక్షి నెట్‌వర్క్



కరకగూడెం: జామ మసీద్‌లో దువా చేస్తున్న ముస్లింలు



మణుగూరుటౌన్: సందేశాన్ని ఇస్తున్న మత బోధకుడు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం మసీద్‌లో..



కరకగూడెం: బక్రీద్ ప్రాముఖ్యతను వివరిస్తున్న మౌలానా ఫిరోజ్



అశ్వారావుపేటరూరల్: కొత్తూరులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



బక్రీద్ వేడుకలో చిన్నారులు..



బూర్గంపాడు: పాత గొమ్మూరు ఈద్గా వద్ద ప్రార్థనలు..



చంద్రుగొండ: మాట్లాడుతున్న ముఫ్తి అబ్దుల్ రెహమాన్



అశ్వాపురం: మంచికంటినగర్‌లోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ములకలపల్లి ఈద్గా వద్ద..

గంజాయి మత్తులో చిత్తు

- గుట్టుగా రవాణా.. నిశిరాత్రిలో అమ్మకాలు
- బానిసలవుతున్న యువత
- ఆందోళనలో తల్లిదండ్రులు



యువత గంజాయి మత్తుకు బానిసలవుతూ బంగారం లాంటి భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. పిల్లలు జీవితం బాగుండాలని ఆశించిన తల్లిదండ్రుల కలలను తుడిచివేస్తున్నారు. గంజాయిని అరికట్టేందుకు పోలీస్‌శాఖ ప్రత్యేక నిఘా పెట్టినప్పటికీ స్మగ్లర్లు వారి కళ్లను గప్పి యథేచ్ఛగా గంజాయిని రవాణా చేస్తూ.. అమ్మకాలు సాగిస్తున్నారు.

మణుగూరురూరల్: నేటి సమాజంలో ఎంతోమంది యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి తమమ జీవితాలను చెడు వ్యసనాలకు అప్పగిస్తున్నారు. రెండు పదుల దాటని యువకులు సైతం గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్నారు. ఈ నేపథ్యంలోమణుగూరు మండలంలో గంజాయి వాడకం యువతలో రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రధానంగా పీవీకాలనీ, బాపనకుంట తదితర ప్రాంతాల్లో గంజాయి క్రయ, విక్రయాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. పట్టణ, మండల శివారులోని అటవీ ప్రాంతాలను కొంతమంది యువకులు అడ్డాగా చేసుకుని నిత్యం గంజాయిని సేవిస్తూ మత్తులో తూగుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి మణుగూరు పట్టణంలో యువత అత్యధిక శాతం గంజాయితో పాటు కొన్ని మాదక ద్రవ్యాలను ఉపయోగిస్తూ అంతులేని మత్తులో జోగుతున్నారు. పీవీకాలనీలోని సింగరేణి పాఠశాల, వాటర్ ట్యాంక్, పైలట్‌కాలనీ గాంధీనగర్ సమీపంలో, బాపనకుంట శివారులోని నిర్మానుష్య గంజాయి తాగుతూ.. అటువైపుగా వెళ్తున్న వారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదిలా ఉంటే గంజాయి మత్తుకు బానిసలైన కొందరు పంచర్లకు వాడే గమ్‌ను, మెడికల్ షాపులో దొరికే పలు రకాల డ్రగ్స్ వంటి వాటిని మత్తునిచ్చే కారకాలుగా వినియోగిస్తున్నారు.

యువతే టార్గెట్..

యువకుల్లో పెరుగుతున్న గంజాయి వాడకాన్ని ఆసరాగా చేసుకున్న స్మగ్లర్లు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పోలీసుల నిఘా కళ్లు గప్పి పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకుంటున్నారు. ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుని క్రయ, విక్రయాలు చేస్తున్నారు. యువతనే టార్గెట్ చేసుకుని తమ జేబులు నింపుకుంటున్నారు. మణుగూరులో గంజాయి వాడకం పేట్రేగిపోతోందని పలువురు బహిరంగంగానే పలువురు చర్చించుకుంటున్నారు.

నిఘా వ్యవస్థ కళ్లుగప్పి..

ఇటీవల కాలంలో గంజాయిని అరికట్టేందుకు పోలీస్‌శాఖ గట్టి నిఘా ఏర్పాటు చేసి భారీ స్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకుంది. అయినప్పటికీ స్మగ్లర్ల గంజాయి దందా ఆగడం లేదు. పోలీసుల కళ్లు గప్పి గంజాయిని రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు. నిఘాను పెంచాలని విన్నవిస్తున్నారు.



మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

చర్ల: ఆదివాసీ గ్రామాల్లో తీవ్ర భయాందోళనకు కారణమైన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చర్లలోని బీఎస్ రామయ్య భవన్‌లో శనివారం సీపీఎం నాయకులు కారం నరేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలోని ఏజెన్సీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ సంపద, జల వనరులు, ప్రకృతి వనరులు ఉన్నాయని, వాటన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం కోసమే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. అటవీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలను వెళ్లగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను సాకుగా చూపి ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం సాగిస్తోందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్ మండల కార్యదర్శి మచ్చ రామారావు మండల కమిటీ సభ్యులు బందెల చంటి, దొడ్డి హరినాథ వర్మ, పామారు బాలాజీ నవీన్, శ్యామల చంద్రం , పొడుపు గంటి సమ్మక్క, తాటి నాగమణి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభం



చిరుమళ్ల బ్రిడ్జి వద్ద మట్టి తీస్తున్న దృశ్యం

కరకగూడెం: మండల పరిధిలోని కీలకమైన చిరుమళ్ల బ్రిడ్జి రహదారి కోతకు గురై వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ చొరవతో మరమ్మతు పనుల కోసం రూ.20 లక్షలు కేటాయించారు. ఈ సమస్యపై ఇటీవల 'మేల్కొంటేనే మేలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన అధికారులు మరమ్మతులకు తాజాగా చర్యలు చేపట్టారు. బ్రిడ్జికి అనుకొని సుమారు 30మీటర్ల పొడవు 3 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ వాల్ నిర్మాణ పనులు రెండు రోజుల క్రితం అధికారికంగా ప్రారంభమయ్యాయి. పనులు ప్రారంభమైన సందర్భంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే అత్యంత ముఖ్యమైన ఈ బ్రిడ్జి మరమ్మతులు నాణ్యతతో,పటిష్టంగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన దాతలు శనివారం విరాళం అందజేశారు. శాంతి నగర్ వాస్తవ్యులు పొట్లూరి విజయలక్ష్మి రూ.1,00,116లను ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి అందజేయగా వారు దాతలకు రసీదును అందించారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సారపాక-1, సారపాక-2 ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. శనివారం ఓ ప్రకటనలో విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

బీమా చెక్కు అందజేత

బూర్గంపాడు: ఏప్రిల్ 9వ తేదీన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఐటీసీ పర్మినెంట్ కార్మికుడు సాక్క నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు టీడీపీ నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్‌లు అందజేశారు. టీడీపీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు పార్టీ ఆధ్వర్యంలో బీమా చేయించి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు.

ఏజెన్సీ చట్టాలకు లోబడి సదస్సులు నిర్వహించాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీ చట్టాలకు లోబడి షెడ్యూల్ ప్రాంతంలో భూ భారతి సదస్సులు నిర్వహించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. శనివారం బండిరేవు గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.. భూభారతి కార్యక్రమాన్ని ఏజెన్సీ ప్రాంతంలో పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను కోరారు. షెడ్యూల్ ప్రాంత నిజమైన ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కోరం మురళి, నాయకులు దబ్బ అనిల్, కారం అన్వేష్, నూప శ్రీరామ్, తాటి రాంబాబు, కురసం వెంకటేష్, వీరేంద్ర, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సంకల్పంతో సాకారం'

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ పాలనలో దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు భూక్యా కుమార్ నాయక్ అన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని 'సంకల్పంతో సాకారం' కార్యాక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ అధ్యక్షతన శనివారం ములకలపల్లిలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో ఆర్టికల్ 370 రద్దు, వందేభారత్ రైళ్ల ఏర్పాటు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్‌కౌన్సిల్ సభ్యుడు అనుమల శ్రీనివాస్, పూనెం రవికుమార్, అత్యం మణికంఠ సాయి, ఊకంటి మధుసూధన్ రావు, సొసైటీ డైరెక్టర్ చీకటి ప్రకాశ్, శనగపాటి సీతారాములు, బాణోతు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

దమ్మపేట: పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల వరకు ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర సామాగ్రిని సబ్సిడీపై అందజేయాలన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసు మేరకు రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పామాయిల్ గెలల ధర ఒక టన్నుకు రూ.21,000లు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, పెనుబల్లి లక్ష్మణరావు, మురహరి రఘు, రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే ముద్దు..



మణుగూరురూరల్: తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయితీలో జెడ్పి హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ పాఠశాలలు వద్దు -ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటూ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రభుత్వ బడులలోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకే మంచి భవిష్యత్ ఉంటుందని ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు హరిలాల్, రూప్లా, సీతారామ్‌లు అన్నారు. శనివారం రాజీవ్‌నగర్ వలస ఆదివాసీ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తీరు, వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

రంగుల కళ.. చిత్రసౌరభం

- యువ చిత్రకారుడి ప్రతిభా ప్రయాణం
- సోనూసూద్, మంత్రి పొంగులేటి తదితరుల అభినందనలు



గీసిన చిత్రాల వద్ద సాయికుమార్



స్నేహితులతో కలిసి మంత్రి పొంగులేటికి చిత్రాన్ని అందిస్తూ.. (ఫైల్)

సండే స్పెషల్

కరకగూడెం: ఓ కళాకారుడు తన భావాలు, ఆలోచనలను చిత్రాల రూపంలో పెట్టడమే చిత్రకళ. ఈ చిత్రాలు, రంగులు సంతోషం, ఉత్సాహాన్ని పంచడమే కాక అనేక అంశాలను లోతుగా తెలియచేస్తాయి. ఇందులో భాగంగానే కరకగూడెం మండలం భట్టుపల్లికి చెందిన అక్కిరెడ్డి నర్సింహులు - నిర్మల కుమారుడు సాయికుమార్ చిత్ర లేఖనంలో తన ప్రతిభతో ఆకట్టుకుంటున్నాడు.

భట్టుపల్లి నుంచి హైదరాబాద్ వరకు

సాయికుమార్ విద్యార్థి దశలో గీసిన చిత్రాలను చూసి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఆయనలో ప్రతిభను గుర్తించారు. 1-6వ తరగతి ఏడూళ్ల బయ్యారంలో, ఆ తర్వాత 10వ తరగతి వరకు మణుగూరులో గురుకులంలో చదవగా, ఆ సమయంలో ఆర్ట్ టీచర్ కృష్ణ ప్రోత్సహించారు. అప్పట్లో చిత్రలేఖన పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాడు. ఆతర్వాత ఇంటర్ చదివాక హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ(జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ)లో బీఎఫ్ఏ(బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) కోర్సులో చేరాడు. అక్కడ చార్‌కోల్ ఆర్ట్, లీఫ్ కటింగ్ ఆర్ట్‌తో పాటు లోగో డిజైనింగ్ తదితర అంశాల్లో నైపుణ్యం సాధించాడు. సాయికుమార్ తాను గీసిన చిత్రాలను సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేస్తుండడంతో ప్రశంసలు దక్కుతున్నాయి. పలువురు ఆయనతో చిత్రాలు వేయించుకుంటుండడంతో ఉపాధి లభిస్తోంది.

అభినందనల వెల్లువ

సాయికుమార్ చిత్రలేఖన నైపుణ్యం సినీ నటుడు సోనూసూద్ దృష్టిని ఆకర్షించింది. సోనూసూద్ చిత్రపటాన్ని పెన్సిల్ గీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి సోనూసూద్‌ను ట్యాగ్ చేశాడు. దీంతో సోనూసూద్ ఆ చిత్రాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసి సాయి ప్రతిభను అభినందించాడు. అలాగే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాన్ని గీసి అందించగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. గ్రాఫిక్ డిజైనర్ కావడం తన లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో సాంకేతిక ఆధారంగా ముందుకు సాగేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.



ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన సోనూసూద్ (ఫైల్)